క్లుప్తంగా

నేడు ఫిర్యాదుల స్వీకరణ

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు ఆదివారం తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజలు అర్జీలు అందజేయాలని, వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినంతో పాటు పలు శుభ కార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో వాహనాల రద్దీ కొనసాగింది.

ఘనంగా నిమజ్జనోత్సవం



చిల్లకల్లు(జగ్గయ్యపేట): దసరా పండుగ సందర్భంగా గ్రామంలోని వైరా రోడ్డులో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహం నిమజ్జన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విగ్రహాన్ని గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించి వేదాద్రిలోని కృష్ణానదిలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

152 మందికి వైద్య పరీక్షలు

నందిగామ టౌన్: గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించటం అభినందనీయమని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్ పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తెలుగునాడు మెడికల్ స్టూడెంట్స్, ఎస్ఆర్ఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్ఆర్ఎం ఆస్పత్రి ఎండీ డాక్టర్ హరికృష్ణతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 152 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాము, గోపి, కార్తిక్, ప్రభాస్, పత్తిపాటి సూర్యం, సంగయ్య, రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా మల్కాపురం రహదారి



జగ్గయ్యపేట: మండలంలోని మల్కాపురం వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డుపై గుంతలు ఏర్పడటమే కాకుండా ఇరుపక్కలా దట్టంగా పిచ్చి మొక్కలు పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తోంది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించాలంటే ప్రమాదాలు తప్పనిసరి అవుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు సైతం రహదారిలో ప్రయాణిస్తుంటే ముళ్లకంపలు తగిలి గాయాలవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. పట్టించుకోవలసిన అధికారులు కూడా పట్టించుకోవడంలేదు. పెరిగిపోయిన కంప చెట్లను తొలగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

బాణసంచా గోడౌన్ తనిఖీ

నూజివీడు: బాణసంచా గోడౌన్‌లో పేలుడు పదార్థాలు నిల్వ చేసేటప్పుడు నిబంధనల ప్రకారం జాగ్రత్తలు తీసుకోవాలని నూజివీడు సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ సూచించారు. నూజివీడు మండలంలోని అన్నవరంలో బాణసంచా నిల్వ కేంద్రాన్ని ఆదివారం నూజివీడు సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ తనిఖీ చేశారు. భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా జాగ్రత్తలు పాటించారా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో కొందరు అక్రమంగా బాణసంచా తయారీ, నిల్వ, విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం అందిందని చెప్పారు. ఎవరైనా అలాంటి కేంద్రాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి తీసుకున్న మేర మాత్రమే బాణసంచాను నిల్వ చేయాలన్నారు. పేలుడు పదార్థాలు నిల్వ చేసేటప్పుడు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

పశువులకు లంపి స్కిన్ వ్యాధి భయం

- టీకాలు తప్పనిసరి అంటున్న పశువైద్యులు
- అమ్మవారి గోశాలలో వ్యాధితో దూడ మృతి
- మరో రెండు దూడలకు సోకిన వ్యాధి



అమ్మవారి గోశాలలో వ్యాధి బారిన పడ్డ దూడ



గోశాలలో టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

పెనుగంచిప్రోలు: వైరస్ ద్వారా తెల్ల పశువులకు చర్మవ్యాధులు సంక్రమిస్తున్నాయి. ఆవుల చర్మంపై బొబ్బలు వచ్చి పుండ్లు ఏర్పడుతున్నాయి. రెండు రోజుల క్రితం పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి గోశాలలో లంపి స్కిన్ వ్యాధితో ఒక దూడ మృతి చెందగా మరో రెండు దూడలకు కూడా వ్యాధి సోకినట్లు గోశాల సిబ్బంది తెలిపారు. దూడకు వారం రోజుల పాటు వైద్య సేవలు అందించినా మృతి చెందిందని, మిగతా వాటికి కూడా టీకాలు వేయించి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అయితే గతంలో కూడా గోశాలలో వ్యాధి ప్రబలటంతో తాత్కాలికంగా గోవులను భక్తుల నుంచి తీసుకోవటం కొన్ని రోజులు నిలుపుదల చేశారు. ఇప్పుడు కూడా అలా చేయటంతో పాటు వ్యాధి సోకిన గోవులు, దూడలను ఇతర వాటి నుంచి దూరంగా ఉంచటం వలన వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉంటుందని భక్తులు అంటున్నారు.

ఇతర గ్రామాల్లో కూడా..

కేవలం అమ్మవారి గోశాలలో మాత్రమే కాకుండా మండలంలో సుబ్బాయిగూడెం, కొణకంచి, నవాబుపేట తదితర గ్రామాల్లో కూడా తెల్ల పశువులకు వ్యాధి సోకినట్లు పశువైద్యులు తెలుపుతున్నారు. వైరస్ సోకి గోవులు, దూడలు మృతి చెందుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈవైరస్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి గోవుల ప్రాణాలు నిలబెట్టాలని కోరుతున్నారు. కొన్ని మృత్యువాత కూడా పడ్డాయన్నారు. మండలంలో 1000 వరకు తెల్ల పశువులు ఉన్నాయి. నియోజకవర్గంలో తెల్లపశువులు మొత్తం నాలుగు వేల వరకు ఉంటాయని పశువైద్యులు అంటున్నారు.

టీకాలు వేయించుకోవాలి



లంపీ స్కిన్ అనే వ్యాధి గాలి ద్వారా సంభవిస్తుంది. తెల్ల పశువుల్లో మాత్రమే ఇది కనిపిస్తోంది. ఈవైరస్ ఒక గోవు నుంచి మరో గోవుకు సంక్రమిస్తుంది. వ్యాధి సోకిన గోవులకు గోట్ పాక్స్ టీకా వేయించాలి. అమ్మవారి గోశాలలో కూడా గోవులకు టీకాలు వేశాం. మండలంలో పలు గ్రామాల్లో తెల్ల పశువులకు ఈవ్యాధి సోకింది. మూడు దూడలు మాత్రం మృత్యువాత పడ్డాయి. ఎక్కువగా ఈవ్యాధి దూడల్లో కనిపిస్తోంది. రైతులు తక్షణం గోవులు, దూడలకు టీకాలు వేయించుకోవాలి.

– పి.అనిల్, పశువైద్యాధికారి, పెనుగంచిప్రోలు

లక్షణాలు ఇవీ..

లంపి స్కిన్ వ్యాధి వైరస్ సోకిన తెల్ల పశువులకు 104 నుంచి 105 డిగ్రీల జ్వరం ఉంటుంది. చర్మం అంతా దద్దుర్లుగా వచ్చి పుండ్లు పడతాయి. అలాగే ఈపశువులు మేత మేయలేక పోవటంతో పాటు శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు పడతాయి. ముఖ్యంగా నాలుగు నెలలు దాటిన పశువులకు తప్పని సరిగా టీకాలు వేయించాలి. అశ్రద్ధ చేస్తే ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుంది.

నిబద్ధతతో పనిచేసే వారికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు

వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు

జగ్గయ్యపేట అర్బన్: నూతనంగా ఏర్పాటు చేయనున్న పార్టీ కమిటీలలో నిబద్ధతతో, చురుకుగా పని చేసేవారిని గుర్తించి ప్రాధాన్యం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జగ్గయ్యపేట మండల పార్టీ అధ్యక్షుడు బూడిద నరసింహారావు అధ్యక్షతన మండల స్థాయి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై మండల, గ్రామ స్థాయి నాయకులు సీరియస్‌గా దృష్టిపెట్టాలన్నారు. మండల స్థాయిలో 22, గ్రామస్థాయిలో 12 అనుబంధ విభాగాల కమిటీల్లో భర్తీ చేయాల్సిన పదవులను వివరించారు.

డిజిటల్ బుక్‌లో సమస్యలను నమోదుపై..

కూటమి ప్రభుత్వం పరిపాలనను పక్కన పెట్టి వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని అక్రమ కేసులు బనాయిస్తోందని తన్నీరు నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను అమలుచేయలేక ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తోందన్నారు. డిజిటల్ బుక్‌లో తమ సమస్యలను నమోదు చేసుకుంటే తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇవ్వడం గొప్పవిషయమన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాసగౌడ్, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి మట్టా ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి సత్యశ్రీనివాసరావు, రాష్ట్ర చేనేత విభాగం అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి నంబూరి రవి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పృథ్వీరాజ్, జిల్లా కార్యదర్శులు మాతంగి నాగబాబు, వేముల మల్లేశ్వరరావు, జిల్లా యూత్ ఉపాధ్యక్షులు బజారు సాయి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి గొర్రెపాటి బుల్లియ్య, జిల్లా మైనార్టీ కార్యదర్శి షేక్ లాల్‌జాన్, జిల్లా రైతువిభాగం కార్యదర్శి బెడదం సత్యనారాయణ, నియోజకవర్గ ప్రచారవిభాగం అధ్యక్షుడు బైరబోయిన బాబు,నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడు బండి రంజిత్, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు బాణావత్ రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి, కార్యదర్శులు పింగళి నర్సింహారెడ్డి, దార్ల ప్రసన్నకుమార్, గ్రామాల పార్టీ అధ్యక్షులు, మండల, గ్రామ స్థాయి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవం



ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవంలో ఎమ్మెల్యే తాతయ్య, రఘురామ్, ఆర్ఎస్ఎస్ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: ఆర్ఎస్ఎస్– విజయవాడ మహానగర్, జగ్గయ్యపేట సంఘం ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవం పట్టణంలోని ఉక్కు కళావేదికలో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన విజయదశమి ఉత్సవంలో మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముఖ్య వక్తగా విచ్చేసిన అఖిల భారతీయ ధర్మ జాగరణ ప్రముఖ్ ఆలే షామ్‌జీ మాట్లాడుతూ క్రమశిక్షణ, ధర్మం, దేశభక్తిని కలిగిన కార్యకర్తలను తయారుచేయడంలో సంఘం 100 ఏళ్ల ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తిచేసుకుందన్నారు. జిల్లా శారీరక ప్రముఖ్ చంద్రశేఖర్, జిల్లా సహ కార్యవాహ గౌరీశంకర్, జగ్గయ్యపేట ఖండ కార్యవాహ తిలక్, స్వయం సేవకులు, స్థానిక ప్రముఖులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని కేతనకొండ గ్రామంలో ఆదివారం మార్గదర్శి లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ చైర్మన్ వక్కలగడ్డ భాస్కరరావు ఆధ్వర్యాన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కృష్ణా హాస్పిటల్ వైద్య బృందం 150 మందికి బీపీ, మధుమేహం, ఊపిరితిత్తులు, అల్సర్, సాధారణ, తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి నలకుర్తి నళిని ఆశాలత, స్థానికులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం నేతకు అభినందన



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శిగా నియమితులైన మట్టా ప్రతాప్‌రెడ్డిని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నేతలు అభినందించారు. ఈ సందర్భంగా ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో జగ్గయ్యపేట మండలం, బూదవాడ గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త మట్టా ప్రతాప్‌రెడ్డిని పూలమాలలు, శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ పేట మండల, పట్టణ అధ్యక్షులు బూడిద నరసింహారావు, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి నంబూరి రవి, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి సత్యశ్రీనివాసరావు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కంచికచర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని రాష్ట్ర భవన నిర్మాణ రంగ కార్మికసంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ హరికృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు వినతిపత్రం ఇచ్చి చెప్పుకుందామంటే స్థానిక నేతలు అవకాశం ఇవ్వటం లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి రాష్ట్రంలోని 35 లక్షల భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు ఓట్లేసి గెలిపించాయని గుర్తుచేశారు. ప్రమాదాల బారిన పడిన కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. సహజమరణానికి రూ.5 లక్షలు ప్రకటించాలని, ప్రసూతి అలవెన్స్ కాన్పుకి రూ.50 వేలు, రెండో కాన్పుకు కూడా రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల ఆడపిల్లలకు పెళ్లికానుక కింద రూ.2 లక్షలు ఇవ్వాలని, చదువుకునే విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకపోతే కూటమి ప్రభుత్వంపై రాబోయే రోజుల్లో పోరుబాట పట్టాల్సి ఉంటుందని హరికృష్ణారెడ్డి అన్నారు.

ఘనంగా అమ్మవారి ఊరేగింపు



మధురానగర్ మెయిన్ రోడ్డులో అమ్మవారి ఊరేగింపు



జీవీఆర్‌నగర్‌లో అమ్మవారి ఊరేగింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ మెయిన్‌రోడ్డు, జీవీఆర్‌నగర్ పందిరి రోడ్డులో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. సుమారు 4వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని ఉంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, తీన్‌మార్‌నృత్యాలు, డీజే, కోలాటంతో మధురానగర్ పురవీధుల మీదుగా ఊరేగింపు సాగింది. దారి పొడవునా భక్తులు మహిళలు అమ్మవారికి స్వాగతం పలికారు. కార్యక్రమాలను అడపా కోటేశ్వరరావు, బర్మా శ్రీను, సింగం వెంకన్న, బాలాజీ, రాంబాబు, శ్రీపతి కిషోర్, యర్రంశెట్టి యశ్వంత్ తదితరులు పర్యవేక్షించారు. గద్దే వెంకట్రామయ్యనగర్‌లో జీవీఆర్‌నగర్ భక్తబృందం ఆధ్వర్యాన అమ్మవారి ఊరేగింపు జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని ఉంచి మేళతాళాలతో అమ్మవారి ఊరేగింపు కొనసాగింది. ఒక పక్క వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు దారి పొడవునా అమ్మవారికి పూజలు చేస్తూ స్వాగతం పలికారు. కార్యక్రమాలను భక్తబృందం సభ్యులు గద్దే శ్రీను, నూతక్కి శ్రీను తదితరులు పర్యవేక్షించారు.

శోభాయమానంగా శ్రీనివాసుని కల్యాణం



శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలోని గాయత్రి కన్వెన్షన్ హాల్లో ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ పండితులు నాయాణం తనుజ విష్ణు వర్ధనాచార్యుల బృందంచే పుష్పయాగయుక్త శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ఆగమ పండితులు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం శోభాయమానంగా జరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ప్రజలు క్షేమంగా ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవంలో గంగాధర భట్ల రాధాకుమారి చేసిన అన్నమాచార్య కీర్తనలు ఆహ్లాదంగా, మనస్సుకి స్వాంతన చేకూర్చే విధంగా ఉన్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ నగర మేయర్ జంధ్యాల శంకర్, 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి, టీటీడీ విశ్రాంత సమన్వయాధికారి మండలీక శ్రీకృష్ణ కుమార శర్మ, జోస్యుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వరి పైరుకు తెల్ల దోమపోటు

- దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం
- ఆందోళనలో అన్నదాతలు



కె.తాడేపల్లి గ్రామంలో తెల్ల దోమపోటుకు గురైన వరి పొలం

విజయవాడరూరల్: వరి పంట పొలాలకు తెల్ల దోమపోటు తగిలింది. వాతావరణంలో మార్పుల కారణంగా గ్రామాల్లో వరి పంట పొలాలు ఉమ్మతీత అధికంగా ఉండటం, చిరుపొట్టదశలో ఉండటంతో వరి పంట పొలాల్లో తెల్ల దోమపోటు ఆశించి పసుపు, తెలుపు రంగుల్లో పంట పొలాలు కనిపిస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నున్న, పాతపాడు, విలేజి కండ్రిక, అంబాపురం, కొత్తూరు, తాడేపల్లి గ్రామాల్లోని వరి పొలాలకు తెల్ల దోమ కనబడుతుంది. దీని ప్రభావంతో పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని రైతులు దిగులు పడుతున్నారు. వర్షాలు వరుసగా కురవడంతో పంట పొలాలకు పూర్తి స్థాయిలో ఎండ తగలడంలేదు. దీంతో ఆకు పీల్చే పురుగు ఆశించడంతో పచ్చగా ఉండాల్సిన పంట తెలుపు రంగులో మారిందని రైతులు అంటున్నారు. ఈ రెండు సమస్యలతో పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిపిటి-5204, 1262 రకం వరిపొలాల్లో ఈ ప్రభావం అధికంగా ఉందని రైతులు చెబుతున్నారు. వరిదుబ్బు మొదళ్లలో ముదురు పచ్చ రంగులో ఉండాల్సింది తెలుపు రంగు లో కనిపిస్తోందంటున్నారు. 1318 రకం వరి పంటలో పసుపు రంగుగా తిరగమారుతుందని నున్న గ్రామానికి చెందిన రైతులు చెబుతున్నారు.

దోమ పోటుకు చర్యలు చేపట్టాలి..

విజయవాడ రూరల్ మండలంలో ఈ ఖరీఫ్ సీజన్లో 9,600 ఎకరాల్లో వరిసాగు జరిగిందని వ్యవసాయాధికారి కె.రఘురామ్ తెలిపారు. తెల్ల దోమ, ఆకు పీల్చే పురుగు సమస్యలను వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బి.వెంకటేశ్వరరావు వద్ద ప్రస్తావించగా ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటను పురుగు ఆశించిన ప్రభావం కనిపించడం లేదన్నారు. ఆయా గ్రామాల్లో వీఏఏలను సంప్రదించాలన్నారు. ఒక వేళ తెల్ల దోమ ఉధృతంగా ఉంటే లీటరు నీటికి ఆర్తీన్ మందు 150 నుంచి 200 గ్రాములు, వేప నూనె 300 పీపీఎం లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా, కట్టలేరు



రాకపోకలు సాగించకుండా వైరా కట్టలేరు వద్ద రోడ్డుపై కంప వేసిన అధికారులు



పల్లంపల్లి సమీపంలో కూడలి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కట్టలేరు వైరా ఉపనది

వీరులపాడు: గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో భారీగా కురుస్తున్న వర్షాలకు వైరా, కట్టలేరు వాగులో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వైరా కట్టలేరుకు వరద నీరు చేరటంతో తహసీల్దార్ పాలపర్తి రవికుమార్, ఎస్ఐ అనిల్ వాగును పరిశీలించి రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని కాపలా ఉంచారు. ఈ ప్రాంతం నుంచి తెలంగాణ రాష్ట్రం మధిర వెళ్లేందుకు ఈ మార్గం ఉంది. అందుకే ప్రయాణికుల రాకపోకలు నిలిపివేశారు.

అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణం..

కూడలి సమీపంలోని వైరా కట్టలేరు ఉపనదిపై గత పాలకులు బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. కానీ ఆ బ్రిడ్జికి రెండువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మించలేదు. దీంతో వర్షాకాలంలో వరద నీరు చేరేటప్పుడు నందిగామ మండలం దాములూరు– వీరులపాడు మండలం పల్లంపల్లి మధ్య ప్రయాణికుల రాకపోకలు నిలిచిపోతున్నాయి. బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు నిర్మిస్తే తప్ప రాకపోకలు సాగవు. రెండు మండలాలతో పాటు ఈ ప్రాంతం నుంచి తెలంగాణ రాష్ట్రానికి వరదలు వస్తున్న సమయంలో ప్రయాణికుల రాకపోకలు నిలిచిపోతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు కాని అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవటంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పొలాల్లో సాగుచేసిన పంట ఉత్పత్తులు ఇళ్లకు చేరవేసేందుకు రైతులు అనేక కష్టాలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని, ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

నిలిచిపోయిన ప్రయాణికుల రాకపోకలు

క్విజ్ పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం 'చదవటం నాకు ఇష్టం' కార్యక్రమంలో భాగంగా గాంధీ గురించి క్విజ్ కార్యక్రమం జరిగింది. గ్రంథాలయ అధికారి రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు దేశ నాయకులు చరిత్రలో తెలిసి ఉండాలనే ఉద్దేశంతో ప్రతి నెల చివరి ఆదివారం క్విజ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. క్విజ్‌ను మాస్టర్ దేవ్, దుర్గా భవాని నిర్వహించారు. వివిధ స్కూల్స్ నుంచి నాలుగో తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులు 30 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉమా అనే చిన్నారి మహాత్మా గాంధీ వేషధారణలో వచ్చి విద్యార్థులను ఆకట్టుకుంది. గాంధీజీ వేషధారణతో అలరించిన ఉమాను గ్రంథాలయ అధికారి జ్ఞాపికతో సత్కరించారు. అలాగే క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

వైభవంగా ప్రభ ఉత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): దసరా మహోత్సవాల సందర్భంగా మా ఆర్ట్స్ నిర్వాహకులు చింతల రామారావు, చంటి బ్రదర్స్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి గాంధీనగర్‌లో నిర్వహించిన అమ్మవారి ప్రభల ఉత్సవం వైభవంగా సాగింది. కార్యక్రమంలో సీనియర్ రాజకీయ నాయకుడు ఆకుల శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు. దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రతి ఏటా బాబీ, చంటి బ్రదర్స్ అమ్మవారి ప్రభలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. దసరా వేషాలు, భేతాళ నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో దాదాపు 40 ప్రభల బండ్లు ఏర్పాటు చేయడం మన సంస్కృతికి నిదర్శనమన్నారు. యర్రంశెట్టి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో రోటరీ క్లబ్



గన్నవరంరూరల్: సమాజ సేవలో రోటరీ క్లబ్ ముందుంటుందని రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం అధ్యక్ష కార్యదర్శులు జీవీ రవిబాబు, కె.నాగరాజు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి పుణ్యాచారిటీస్ వృద్ధాశ్రమ కార్యదర్శి జాస్తి విజయభూషణ్‌కుమార్ సౌజన్యంతో బీటెక్ చదువుతున్న కందుల నాగ సాత్వికకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ఆమె తల్లి భాగ్యలక్ష్మికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థులకు పుణ్యాచారిటీస్ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. రోటరీ క్లబ్ సమాజ సేవతో పాటు పేద విద్యార్థులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. రొటేరియన్లు నర్రా సీతారామారావు, కొల్లి సత్యజగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.